# నాడీ పట్టేది నకిలీలే !

## అర్హత లేకుండా వైద్యం చేస్తున్న నకిలీ డాక్టర్లు

- బాధితుల ఫిర్యాదులతో 38 ఆసుపత్రుల సీజ్
- ప్రైవేటు ఆసుపత్రుల్లో పర్యవేక్షణ లోపం



సాక్షి,సిటీబ్యూరో: అర్హతలు లేకుండా వైద్యం చేస్తూ.. ప్రజల ప్రాణాలు తీస్తున్న నకిలీ వైద్యులపై కేసులు నమోదైన ఘటనలు గ్రేటర్‌తో సహా శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో చర్చనీయాంశమవుతోంది.

- మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో దాదాపు 3,835 పైగా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు ఉండగా.. ఇందులో రిజిస్ట్రేషన్‌తో సహా వివిధ అనుమతితో కొనసాగుతున్న ఆసుపత్రులు 2,840 మాత్రమే ఉన్నాయి. ఈ ఆసుపత్రుల్లో 100 కంటే ఎక్కువ పడకలు (బెడ్స్) ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు 58 ఉండగా.. 20 నుంచి 100 పడకలు (బెడ్స్) ఉన్న ఆస్పత్రులు 417 ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ చెబుతోంది.

### అనుమతులు లేనివి అధికం..

20 పడకలు (బెడ్స్) ఉన్న ఆసుపత్రులు 594 ఉన్నాయి. 1012 పాలీక్లినిక్‌లు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, 280 డెంటల్ ఆసుపత్రులు, 66 ఫిజియోథెరపీ సెంటర్లు, 10 రిహాబిలిటేషన్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో అనుమతిలేనివి అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది.

### సీజ్ అయిన ఆసుపత్రులు ఇవే..

బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలోని చెంగిచర్ల భవిష్యా వెల్ విస్సర్ ఆసుపత్రిని అర్హత లేని మెడికల్ డైరెక్టర్, డాక్టర్లు, సిబ్బందితో కొనసాగిస్తున్నట్లు గుర్తించిన వైద్యశాఖ ఇటీవల ఈ ఆసుపత్రి రిజిస్ట్రేషన్‌ను 60 రోజులు సస్పెండ్ చేయడంతో పాటు మేనేజ్‌మెంట్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసింది. ఆసుపత్రి ప్రాంగణాన్ని స్వాధీనం చేసుకుని, అన్ని వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ ఉపకరణాలను జప్తు చేసింది. ఆసుపత్రి యాజమాన్యానికి రూ.5 లక్షల జరిమానా కూడా విధించింది.

- జగద్గిరిగుట్టలోని హాసిని ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను ఫార్మ్‌డీ అర్హత ఉన్న ప్రతీక్ అనే వ్యక్తి నకిలీ జనరల్ ఫిజిషియన్‌గా వైద్య చికిత్సలు నిర్వహిస్తున్నట్లు గుర్తించి, ఈ క్లినిక్‌ను సీజ్ చేసింది.
- బాచుపల్లిలో ఎలాంటి అర్హతలు లేకుండా కొనసాగుతున్న సహజ పాలీక్లినిక్, బుచ్చిబాబు ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను సీజ్ చేసింది.
- మల్కాజిగిరి, ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో అనుకృష్ణ ఆసుపత్రిని సీజ్ చేసిన వైద్యబృందం డీఎం ఆసుపత్రికి నోటీసులు జారీ చేసింది.
- మల్కాజిగిరి ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న శ్రీసాయి ఫస్ట్ ఎయిడ్ సెంటర్, షాదన్‌క్లినిక్‌లను వైద్యాధికారులు సీజ్ చేశారు.
- అల్వాల్ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న గౌరవి పాలీ క్లినిక్, భువన డయాగ్నస్టిక్ సెంటర్‌ను సీజ్ అయ్యింది.
- బొల్లారంలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని ఉల్లంఘించిన భవాని పోలీక్లినిక్‌ను వైద్య బృందం సీజ్ చేసింది. ఈ క్లినిక్ అనేక ఏళ్లుగా ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం కలిగించే వైద్యసేవలను అందిస్తున్నట్లు వైద్యశాఖ గుర్తించింది. క్లినిక్ నిర్వాహకులు నకిలీ జనరల్ ఫిజీషియన్‌గా శక్తివంతమైన యాంటీబయోటిక్స్ రాయడం, ఐవీ ఇన్ఫ్యూషన్లు ఇవ్వడం వంటి వైద్యసేవలను అందిస్తున్నట్లు పేర్కొంది.
- మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 38 క్లినిక్‌లను సీజ్ చేయడంతో పాటు 10 డయాగ్నస్టిక్, స్కానింగ్, అల్ట్రా సెంటర్లను మూసివేసింది. ప్రభుత్వ నిబంధనలను పాటించని పలు ప్రైవేట్ ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులను కూడా వైద్యారోగ్యశాఖ జారీ చేసింది. ఇదిలా ఉండగా, వైద్యశాఖలో కొందరికి మామూళ్లు అప్పచెబుతున్న పలు ప్రైవేట్ ఆసుపత్రుల యజమాన్యం యధావిధిగా నకిలీ వైద్యులతో వైద్య సేవలు సహా చికిత్సలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### అనుమతి నిబంధనలు ఇలా..

అల్లోపతి ప్రైవేటు మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, కన్సల్టెంట్ క్లినిక్‌లు, ఆయుష్ క్లినిక్‌లు, ఫిజియోథెరపీ కేంద్రాలు అన్నింటికీ అనుమతి తప్పనిసరి. ఆసుపత్రి, క్లినిక్, డయాగ్నస్టిక్ కేంద్రాల నిర్వాహకులు, అందులో పనిచేసే వైద్యుల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలి.

- అగ్నిమాపక, బయోవేస్ట్ మేనేజ్‌మెంట్, పొల్యూషన్, మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్‌తో సహా అన్ని రకాల పత్రాలు సరిగ్గా ఉన్నప్పుడే ఆసుపత్రుల ఏర్పాటుకు అనుమతి ఇస్తారు.

### చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

విద్యార్హతలు లేకుండా కొందరు వైద్యం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే పలు ఆసుపత్రులపై నిఘా పెంచాం. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. నకిలీ వైద్యులపై స్థానికులు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ సి.ఉమాగౌరీ, డీఎంహెచ్‌ఓ, మేడ్చల్ జిల్లా

# ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

**బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్**

నిజాంపేట్: నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ రాజీవ్‌గాంధీ నగర్, 17వ డివిజన్ కౌసల్య కాలనీ, 18వ డివిజన్ సాయి అనురాగ్, 20వ డివిజన్‌లోని పూజిత ఎన్‌క్లేవ్ కాలనీలలో పర్యటించారు. భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు, పొల్యూషన్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వెలుస్తున్న కాలనీలలో ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్లు ఆగంరాజు, బాలాజీ నాయక్, రాఘవేంద్రరావు, గాజుల సుజాత, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి సతీష్, మున్సిపల్ డీఈ యూనిస్, ఏఈ ప్రవీణ్, వాటర్‌వర్క్స్ డీజీఎం చంద్రమోహన్, మేనేజర్ సౌమ్య, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సుకృతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**వసతుల కల్పనకు కృషి**

ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. 125 గాజులరామారం డివిజన్ మిథిలా నగర్‌లో రూ. 20 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. కార్పొరేటర్ రావుల శేషగిరి, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, శివనాయక్, ఆసిఫ్, ప్రసాద్, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీపీఐ శాఖ కార్యదర్శుల ఎన్నిక



కాట్రగడ్డ వాసు



ఆశీ యాదయ్య



ఢిల్లేశ్వర్‌రావు

నిజాంపేట్: సీపీఐ బాచుపల్లి మండల మహాసభ సందర్భంగా శనివారం ప్రగతినగర్, బాచుపల్లి, నిజాంపేట్ శాఖల కార్యదర్శులను ఎన్నుకున్నారు. ప్రగతినగర్ శాఖ కార్యదర్శిగా కాట్రగడ్డ వాసు, నిజాంపేట్ శాఖ కార్యదర్శిగా ఆశీ యాదయ్య, బాచుపల్లి శాఖ కార్యదర్శి ఢిల్లేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు నిర్వహించాలన్నారు. మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాలు పాలబిందెల సింధూరి, సీపీఐ మండల నాయకులు దుర్గయ్య, మాణిక్యం, కార్తీక్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు పంచామృత అభిషేకం

జగద్గిరిగుట్ట: శ్రావణ నక్షత్రం సందర్భంగా సోమవారం పద్మానగర్ ఫేజ్ 1లోని శ్రీదేవి భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వరస్వామికి పంచామృత అభిషేకం నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం ఆలయ కమిటీ ఓ ప్రకటన విడుదల చేసింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని పేర్కొంది.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



నిజాంపేట్: ఎమ్మెల్యే వివేకానంద్ మంజూరు చేయించిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను నిజాంపేట్ బీఆర్ఎస్ కార్యాలయంలో లబ్ధిదారులు కృష్ణగౌడ్, అర్జ వెంకట శేషమ్మలకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ మాట్లాడుతూ.. పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ర్యాలీకి తరలిన బీజేపీ నాయకులు



కుత్బుల్లాపూర్: ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా చేపట్టిన సందర్భంగా త్రివర్ణ దళాధిపతులకు మద్దతుగా నగరంలోని ట్యాంక్ బండ్ వద్ద చేపట్టిన ర్యాలీకి కొంపల్లి నుంచి శనివారం పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు సతీష్‌సాగర్, జిల్లా నాయకులు రాజిరెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ శివాజీ రాజు, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

## మున్సిపల్ సూపర్‌వైజర్‌పై కేసు నమోదు

దుండిగల్: గ్యార్బేజీ వర్కర్ల నుంచి ఆటోల నిర్వహణకు డబ్బులు వసూలు చేసిన సూపర్‌వైజర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. దుండిగల్ మున్సిపల్ పరిధిలో గ్యార్బేజీ వర్కర్‌గా పని చేస్తున్న బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీకి చెందిన కదమంచి కృష్ణ నుంచి మున్సిపల్ సూపర్‌వైజర్ సిద్దార్థ రూ.50 వేలు తీసుకున్నాడు. అదే విధంగా మిగతా గ్యార్బేజీ వర్కర్ల నుంచి లక్ష వరకు వసూలు చేశాడు. కొన్ని రోజుల పాటు ఆటోల ద్వారా చెత్త నిర్వహణ చేపట్టగా.. ఇటీవల సిద్దార్థ చెత్త సేకరణ ఆటోలను అనుమతించడం లేదు. దీంతో తమ నుంచి డబ్బులు తీసుకుని సూపర్‌వైజర్ మోసం చేశాడని కదమంచి కృష్ణ శనివారం దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆలయంలో అన్నదానం



జగద్గిరిగుట్ట: చింతల్, శ్రీసాయి కాలనీలోని అభయ ఆంజనేయ, పోచమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిర్వహణ లేక.. నిరుపయోగంగా!



రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్ల వెంబడి పాదచారులు, వాహనదారుల సౌకర్యార్థం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూత్రశాలలు నిరుపయోగంగా మారుతున్నాయి. చాలా ప్రాంతాల్లో నిర్వహణ లేకపోవడం, మరికొన్ని చోట్ల ఓవర్ హెడ్‌ట్యాంక్‌లు, నల్లా పైపులు మాయం కావడంతో వినియోగించుకోలేని పరిస్థితి ఉంది. షాపూర్‌నగర్ నుంచి చింతల్‌కు వెళ్లే హెచ్ఎంటీ ప్రధాన రోడ్డులోని యూనియన్ బ్యాంక్ సమీపంలోని మూత్రశాలకు ఏర్పాటు చేసిన పైపులను గుర్తు తెలియని వ్యక్తులు అపహకరించారు. దీంతో వినియోగంలో లేకుండా పోతోంది. సంబంధిత అధికారులు స్పందించి పైపులు ఏర్పాటు చేయిస్తే ఉపయోగంగా ఉంటుంది.

# ఉగ్రవాదం అంతమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం



తిరంగాయాత్రలో పాల్గొన్న నాయకులు

దుండిగల్: ఉగ్రవాదులను అంతమొందించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి ఎస్.మల్లారెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ దిగ్విజయం సందర్భంగా గండిమైసమ్మ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్‌కు భారత బలగాలు ధీటుగా జవాబు ఇచ్చాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, నేతలు మల్లేష్ యాదవ్, మల్లారెడ్డి, రాంచంద్రారెడ్డి, వెంకటేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బాలానగర్: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు రూ.4.58 లక్షల విలువ గల చెక్కులను బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో పుష్పారెడ్డి, లక్ష్మయ్య, ప్రకాష్, రమేష్, చున్ను పాషా, కుక్కల రమేష్, అయాజ్, అస్లాం, వరహాల స్వామి పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరిస్తాం



సమావేశమైన ఏఎంహెచ్ఓ కవిత

రంగారెడ్డినగర్: సిబ్బంది కొరత వల్ల శానిటేషన్ పనులపై ప్రభావం పడుతోందని, త్వరలోనే సమస్యను అధిగమిస్తామని కుత్బుల్లాపూర్ సర్కిల్ ఏఎంహెచ్ఓ కవిత అన్నారు. శనివారం రంగారెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ కార్యాలయంలో ఏఎంహెచ్ఓ ఫీల్డ్‌స్టాఫ్‌తో సమావేశమయ్యారు. పలు బస్తీల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఏలు సత్యవతి, గణేష్, సంపత్‌లను ఆదేశించారు. సమావేశంలో జవాన్ జిలానీ, పారిశుద్ధ్య సిబ్బంది, వివిధ బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సైనికులను అవమానపర్చడం బీజేపీకి తగదు

**సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్**

జగద్గిరిగుట్ట: సైనికులను అవమానపరిచినందుకు మధ్యప్రదేశ్ ఉపముఖ్యమంత్రి జగదీష్‌ను వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాణాలను పణంగా పెట్టి దేశ సేవ కోసం పనిచేస్తున్న సైనికులు మోదీ కాళ్లు మొక్కాలని అనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బీజేపీ నాయకులు నిత్యం ఏదో ఒక చోట సైనికుల త్యాగాలను అవమానపరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు హరినాథ్, నాయకులు జంబు, ప్రభాకర్, జహంగీర్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## హనుమాన్ ఆలయంలో పూజలు



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: గాజులరామారంలోని శ్రీహనుమాన్ ఆలయంలో శనివారం హనుమాన్ మాలధారణ ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ కుమారుడు హనుమాన్ మాల ధరించారు. శ్రీశైలంగౌడ్ కుటుంబ సభ్యులతో పాల్గొని స్వామి వారికి అభిషేకం, ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భజనలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికత సంతరించుకుంది.

# ఎస్ఐలకు సెక్టార్ల కేటాయింపు

కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన పలువురు ఎస్ఐలకు సెక్టార్లను కేటాయించారు. ఆయా సెక్టార్ల ఇన్‌చార్జీలు, ప్రాంతాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

**సెక్టార్-1, ఎస్ఐ నరసింహులు (9490213722)**

సుచిత్ర కూడలి, వెన్నెలగడ్డ, బౌద్ధనగర్, దుర్గా ఎస్టేట్స్, వేంకటేశ్వర కాలనీ, రాఘవేంద్ర కాలనీ, ఎం.ఎస్.రెడ్డినగర్, బ్యాంక్ కాలనీ, పద్మానగర్ ఫేజ్-2, బాపూనగర్, వాజ్‌పేయినగర్, రామకృష్ణ నగర్, శ్రీరామ్‌నగర్, వెంకన్న హిల్స్, సంజీవయ్యనగర్.

**సెక్టార్-2, ఎస్ఐ లావణ్య (8712568322)**

భాగ్యలక్ష్మి కాలనీ, శ్రీకృష్ణనగర్, జయరామ్‌నగర్, జీకేనగర్, రుక్మిణి ఎన్‌క్లేవ్, మహానగర్ సొసైటీ, గణేష్ హౌసింగ్ కాలనీ, సుభాష్‌నగర్, గోదావరి హోమ్స్, గ్రీన్ పార్కు, జీడిమెట్ల గ్రామం, దండమూడి ఎన్‌క్లేవ్, ఏరోనాటిక్ ఎన్‌క్లేవ్, ఎన్‌సీఎల్, శాంతాశ్రీరామ్, శానిలైట్ టౌన్‌షిప్, బీహెచ్ఈఎల్ హౌసింగ్ సొసైటీ, ప్రాగా టూల్స్ కాలనీ, డీటీవో కార్యాలయం, సత్యం ఎన్‌క్లేవ్, ఎన్‌సీఎల్ నార్త్, పేట్ బషీరాబాద్ పైపులైన్ రోడ్డు, సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ, ఫాక్స్‌సాగర్.

**సెక్టార్-3, ఎస్ఐ ధర్మేశ్ (8712568129)**

సినీ ప్లానెట్, ఉమామహేశ్వర కాలనీ, జయభేరి పార్కు, దేవీ హోమ్స్, ప్రజయ్‌గృహతార అపార్ట్‌మెంట్స్, వెన్‌సాయి, దూలపల్లి కూడలి, శ్రీనివాసనగర్, నాగార్జున డ్రీమ్ ల్యాండ్స్, అశోక అలా మైసన్, దూలపల్లి గ్రామం, దూలపల్లి పారిశ్రామిక వాడ, ఫారెస్ట్ అకాడమీ.

**సెక్టార్-4 ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి ( 87125 68384)**

గుండ్లపోచంపల్లి గ్రామం, రైల్వేస్టేషన్, కేపీఆర్‌రెడ్డి నగర్, మైసమ్మగూడ, దూలపల్లి కూడలి నుంచి మైసమ్మగూడ, అపర్ణ ఫామ్ మిడోస్, నైబర్‌హుడ్ కాలనీ, లక్ష్మీనగర్, గుండ్లపోచంపల్లి విత్తనాల పరిశ్రమలు, వేర్‌హౌస్‌లు, అపెరల్ పార్క్, చర్మాస్, గుమ్మడి ఎన్‌క్లేవ్.

**సెక్టార్-4 ఎస్ఐ సురేందర్‌రెడ్డి (8712568203)**

రామరాజునగర్, ప్రపూర్ణ ఎన్‌క్లేవ్, స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ, ఓం బుక్స్, మీనాక్షి ఎస్టేట్స్, పేట్‌బషీరాబాద్, కాంటన్ పార్కు, ఎన్‌సీఎల్ సౌత్, పోచమ్మ గడ్డ, సాయికృప అపార్ట్‌మెంట్స్, దేవరయాంజాల్, ఎలుగల గూడెం, సాయిగీత ఆశ్రమం, జయదర్శిని కాలనీ.

## ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న నర్సులు

కుత్బుల్లాపూర్: రోగుల పట్ల అంకితభావంతో పని చేస్తున్న నర్సుల సేవలు ఎంతో విలువైనవని రెనోవా హాస్పిటల్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్ పెద్దిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవంలో భాగంగా శనివారం కొంపల్లిలోని ఆసుపత్రిలో నర్సులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం నర్సులు సంప్రదాయ నృత్యాలు, సంగీత ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు రాధాకృష్ణ, రవీంద్రనాథ్, కృష్ణ మోహన్, ఎస్. శ్రీనాథ్ అరుణ్ దేవ్, నితిన్‌రెడ్డి, మహాదేవ్ సిబ్బంది పాల్గొన్నారు.

# 10 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి, నిందితులతో పోలీసులు

కుత్బుల్లాపూర్: గంజాయి విక్రయదారుల నుంచి మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ జిల్లా ఎక్సైజ్ అధికారి షేక్ ఫయాజుద్దీన్ శనివారం వివరాలు వెల్లడించారు. అనంతపురం జిల్లా గుంతకల్‌కు చెందిన చాకలి వంశీ(26), వేణుగోపాల్(26) కర్ణాటక రాష్ట్రానికి చెందిన రాము వద్ద గంజాయిని కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మాధవయ్య పర్యవేక్షణలో శనివారం సుచిత్ర చౌరస్తాలో తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ నర్సిరెడ్డి, ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో సిబ్బంది పల్సర్ బైక్( ఏపీ21 ఏఎల్5285) పై వచ్చిన వంశీ, వేణుగోపాల్‌ను తనిఖీలు చేయగా.. వారి వద్ద 10 కిలోల గంజాయి పట్టుబడింది. వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సీజ్ చేసిన గంజాయి విలువ రూ.3.75 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ తనిఖీల్లో సిబ్బంది సుల్తాన్, సంజయ్, వెంకటేశ్వరరావు, తేజ, మునాఫ్ పాల్గొన్నారు.

## దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న డబుల్ బెడ్‌రూం గృహ యజమానులు దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ నివాసితులు రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకోవాలని, బ్లాకుల వారీగా కాకుండా అన్ని బ్లాకులను కలిసి ఏర్పాటు చేసుకోవాలన్నారు. సొసైటీ నుంచి వచ్చే ఫిర్యాదులపై తాము స్పందించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎవరికైనా సమస్యలు ఉంటే మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. డబ్బులు డిమాండ్ చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి నెంబరు చూపిస్తామని ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.